## క్లుప్తంగా

### నాలుగున్నరేళ్లలో 75 ఏళ్ల అభివృద్ధి

గూడూరురూరల్: పట్టణంలో గత 75 ఏళ్లలో జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్ల కాలంలో చేశామని చెప్పుకోవడానికి ఎంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎంతో మంది చైర్మన్లు, చైర్‌పర్సన్లు పని చేసినప్పటికీ ఆ ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత గూడూరు పట్టణానికి రూ.కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించారన్నారు. అభివృద్ధి పనులు చేసేందుకు గూడూరు ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తమ కుటుంబం మొత్తం జీవితాంతం రుణపడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, ఏ మురళి, జేసీఎస్ మండల కన్వీనర్ రాఘవరెడ్డి, అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యుడు ఎస్పీ రమణయ్య పాల్గొన్నారు.

### అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు శనివారం అన్నదానం చేశారు. ఉదయం లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన సీ అజయ్‌కుమార్, మయూరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామివారికి పల్లకీ సేవ జరిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్ పర్యవేక్షించారు.

### 21న మండల మీట్

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన ఎంపీపీ సుజాతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. ఈ సమావేశానికి అభివృద్ధిపై చర్చ జరుగుతుందని ఆయన తెలిపారు. తప్పక ప్రతిశాఖ అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని ఆయన కోరారు.

### శిథిల భవనాన్ని తొలగించండి



కూలేస్థితిలో ఉన్న శిథిల భవనం

చిల్లకూరు: మండలంలోని కడివేడు జెడ్పీ హైస్కూలులో ఉన్న శిథిల భవనాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కడివేడు జెడ్పీ హైస్కూలు ఆవరణలో 25 ఏళ్ల కిందట మహిళా మండలి భవనం నిర్మించారు. దీన్ని పూర్తిస్థాయిలో వినియోగించక పోవడంతో అది శిథిలావస్థకు చేరుకుంది. ఆ భవనం పాఠశాల ఆవరణలో ఉండడంతో విద్యార్థులు అక్కడకు వెళ్లిన సమయంలో అది కూలితే ప్రమాదం జరుగుతుందని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. మండల పరిషత్, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు.

### చౌకదుకాణ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

నాయుడుపేట: పట్టణంలోని చౌక దుకాణ డీలర్ బీ లక్ష్మీదేవి అవకతవకలకు పాల్పడినట్లు కార్డుదారులు ఫిర్యాదు చేయడంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్స్ డీటీ ఓబయ్య శనివారం తెలిపారు. సీఎస్ డీటీ స్థానిక వీఆర్వో శ్రీనివాసులుతో కలసి శనివారం చౌక దుకాణం తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో ఉండాల్సి బియ్యం, రాగులు, చక్కెర తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. అలాగే మే నెల ఒకటో తేదీ తిరుపతి జిల్లా విజిలెన్స్ అధికారులు పట్టుకున్న 1,890 కిలోల రేషన్ బియ్యం ఈ రేషన్ షాపునకు అప్పగించారన్నారు. అందులో కేవలం 200 కిలోలు మాత్రమే ఉండడం గుర్తించామన్నారు. అవకతవకలు పాల్పడిన డీలర్ లక్ష్మీదేవిపై కేసు నమోదు చేసి, చౌక దుకాణం సీజ్ చేసినట్లు సీఎస్ డీటీ తెలిపారు. చౌక దుకాణంలో ఉన్న బియ్యం తదితర వస్తువులు వీఆర్వోకు అప్పగించినట్లు తెలిపారు.

### సీసీరోడ్డుకు భూమిపూజ

నాయుడుపేటటౌన్: జువ్వలపాళెం పంచాయతీ పరిధిలోని మందబైలు, కారుమంచివారి కండ్రిగ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి శనివారం భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు సీసీ రోడ్డు వేయాలని వినతి పత్రాలు అందజేశారు. దీంతో రూ.20 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు పనులు మొదలు పెట్టారు. సర్పంచ్ టీ రమణయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎన్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# కొత్తగా మురిపించేన్

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత సామాజిక భద్రత పింఛన్ల మంజూరు సంఖ్య నెల నెలా పెరుగుతున్నాయి. అర్హులైన కొత్త వారు దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలన పూర్తి చేసి, అర్హత ఉంటే మంజూరు చేస్తున్నారు. ఫలితంగా కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు నగదు అందుకుని మురిసిపోతున్నారు. కొత్త పింఛన్ల మంజూరుపై ప్రత్యేక కథనం.

- మండలంలో 242 మందికి మంజూరు
- ప్రతినెలా 6,400 మందికి రూ.1.60 కోట్ల నగదు పంపిణీ
- వలంటీర్ల ద్వారా అందజేత



దక్కిలి: దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

దక్కిలి: వైఎస్సార్ పింఛన్ కానుక కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం అభాగ్యులకు అండగా నిలుస్తోంది. పింఛన్లు కోసం లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ల మంజూరులో తీసుకొచ్చిన నూతన మార్పులతో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా కొత్తగా పింఛన్లు పొందుతున్నారు. మండలంలో గత నాలుగేళ్లలో 1,200 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి కొత్తగా 242 మందికి కొత్తగా పింఛన్లు నగదు అందజేస్తున్నారు. మండలంలో మొత్తం 6,400 మందికి పింఛన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ప్రతి నెలా లబ్ధిదారులకు రూ.1.60 కోట్ల నగదును పంపిణీ చేస్తున్నారు.

**టీడీపీ హయాంలో అవస్థలే**

టీడీపీ పాలనలో పింఛన్ కోసం లబ్ధిదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. జన్మభూమి కమిటీలు సంతకం పెట్టకపోతే కొత్త పింఛన్ల మంజూరు చేసే అధికారం ఉన్నతాధికారులకు ఉండేది కాదు. ప్రతి నెలా నగదు సైతం 4, 5 తేదీల నుంచి పంపిణీ చేసేవారు. పంచాయతీ కార్యాలయాలు, పాఠశాల వద్దకు లబ్ధిదారులు వెళ్లి, గంటలు తరబడి వేసి ఉంటే నగదు అందించేవారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్ అందజేస్తున్నారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడకు వలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఈ సౌకర్యం ఉంది. కొన్ని రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి నెలకు రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు పింఛన్లు అందిస్తున్నారు.

**కొత్త పింఛన్లు మంజూరు**



దక్కిలి మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 242 నూతన పింఛన్లు దరఖాస్తులు పరిశీలించి, అర్హులను గుర్తించి, మంజూరు చేశాం. ఈ నెల నుంచి ప్రభుత్వం వారికి నగదు విడుదల చేసింది. వెంటనే వలంటీర్లు ద్వారా పింఛన్ సొమ్ము అందిస్తున్నాం. ఇప్పటివరకు మండలంలో 6,400 మందికి రూ.1.60 కోట్ల నగదును పంపిణీ చేస్తున్నాం. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నాం. –ప్రసన్నకుమారి, ఎంపీడీఓ, దక్కిలి



ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

## రైతులకు విశేష సేవలు

నాయుడుపేటటౌన్: ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి రైతులకు విశేష సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొనియాడారు. పట్టణంలోని జువ్వలపాళెం రోడ్డు సమీపంలో టీఎంఆర్ అపార్టుమెంట్ వద్ద జరిగిన జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, ఆయన్ని ఘనంగా సత్కరించారు. అలాగే పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి తదితర మండలాకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతోపాటు పట్టణ ప్రముఖులు, విద్యాసంస్థల కరస్పాండెంట్‌లు, వ్యాపార సంఘం నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై జనార్దన్‌రెడ్డికి శాలువలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్ గ్రూప్ సంస్థల డైరెక్టర్లు టీ మోహన్‌రెడ్డి, హేమంత్‌కుమార్ రెడ్డి, సురేష్ రెడ్డి, ఎన్‌సీఆర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ మొబైల్స్‌లో వీఓ వీ29ఈ దిమాస్టర్ సిరీస్ విడుదల



నూతన మోడల్ మొబైల్‌ను ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు, షోరూం అధినేతలు

గూడూరురూరల్: పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న ఆర్ఎస్ మొబైల్స్ షోరూంలో ప్రముఖ స్మార్ట్ ఫోన్ కంపెనీ వీఓ ప్రతినిధులు వీఓ వీ29ఈ ది మాస్టర్ సిరీస్ నూతన మోడల్‌ను శనివారం విడుదల చేశారు. నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కొత్త మొబైళ్లను విడుదల చేస్తూ వినియోగదారుల అభిరుచి మేరకు అతి తక్కువ ధరలో అద్భుతమైన నూతన మోడల్ వీఓ వీ29ఈ ది మాస్టర్ సిరీస్‌ను విడుదల చేసిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. పలు రకాల ఫీచర్లు ఉండే ఈ మొబైల్‌లో 5జీ టెక్నాలజీతోపాటుగా అధునాతన సాంకేతిక సదుపాయాలున్నాయని, చిన్నపాటి మినీ కంప్యూటర్‌లా దీనిని ఉపయోగించుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్.మొబైల్స్ అధినేత మంజులా రాధాకృష్ణ, జానా రమేష్, శ్రీలక్ష్మి కమ్యూనికేషన్స్ డిస్ట్రిబ్యూటర్ సునీల్, నాగార్జున, ఏఎస్ఎం త్రిలోక్, మేనేజర్ రాజేష్, షోరూం సిబ్బంది మౌలాలి, నవీన్ పాల్గొన్నారు.

## శరవేగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు





అనంతమడుగులో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ, లింగసముద్రంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

సైదాపురం: మండలంలోని లింగసముద్రం, అనంతమడుగు పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గడప గడప మన ప్రభుత్వం నిధులతో ఆయా పంచాయతీల్లో పనులు చేస్తున్నారు. అనంతమడుగు పంచాయతీలో రూ.20 లక్షల వ్యయంతో సుమారు 760 మీటర్ల దూరం డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను చివరి దశలో ఉన్నాయి. అలాగే మండలంలోని లింగసముద్రంలో సుమారు రూ.10.50 లక్షలు వ్యయంతో సుమారు 301 మీటర్ల దూరం సీసీ రోడ్డు నిర్మించారు.

## పౌష్టికాహారం పంపిణీ

గూడూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దాతలు శనివారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. డాక్టర్ రాజా, డాక్టర్ రవి చేతుల మీదుగా నిరుపేద గర్భిణులకు వెజిటబుల్ రైస్, కోడిగుడ్డు, అరటిపండు, వాటర్‌బాటిల్‌ను అందజేశారు. డాక్టర్ రాజా మాట్లాడుతూ జేవీవీ వారు తొమ్మిదేళ్లుగా చేస్తున్న సేవల అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, దాత నందిమండలం బాలకృష్ణంరాజు, చెంచునారాయణ, రామమోహన్, గుర్రం విజయ్‌బాబు, కటకం శ్రీను, జగదీష్, మురళీసింగ్, అశోక్, వడ్లమూడి వెంకట్ పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం



నగదు అందజేస్తున్న లక్ష్మి,సాత్విక్



విరాళం అందజేస్తున్న కామేష్, మంజుప్రీతి

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి శనివారం అన్నమయ్య జిల్లా చిట్వేల్‌కు చెందిన లక్ష్మి, సాత్విక్ రూ.లక్ష విరాళం అందజేసినట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. అలాగే తిరుపతిజిల్లా గూడూరుకు చెందిన కామేష్ ధర్మపత్ని వెంకటమంజుప్రీతి రూ.50,116 అందజేసినట్లు చెప్పారు. దాతలకు 3 ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వినోద్‌స్వామి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## ముందస్తు జాగ్రత్త చర్యలు

నాయుడుపేటటౌన్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐలు నరసింహరావు, వైవీ సోమయ్య, ఎస్ఐలు, పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

# లోక్‌అదాలత్‌లో 3,046 కేసుల పరిష్కారం



గూడూరులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్



వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో జరిగిన మెగాలోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి, సిబ్బంది

గూడూరురూరల్: పట్టణంలోని కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఇరు వర్గాల సమ్మతితో రాజీమార్గంలో 3,046 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్ తెలిపారు. గూడూరులోని ఏడో అదనపు జిల్లా జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు, అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టుల్లో ఉన్న సివిల్, క్రిమినల్, రవాణా, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, తదితర కేసులకు సంబంధించి కక్షిదారులతో చర్చించి ఇరువర్గాల సమ్మతితో రాజీమార్గంలో 3,046 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్ తెలిపారు. పలు కేసులకు సంబంధించి కక్షిదారులకు రూ.2.41 కోట్లు పరిహారాన్ని అందజేశామన్నారు. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, లోక్‌అదాలత్ సభ్యులు ఏ పార్వతయ్య, కోటేశ్వరరావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

**వెంకటగిరిలో 2,428 కేసులు రాజీ**

వెంకటగిరిరూరల్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 2,428 కేసులు రాజీ కుదిర్చి, రూ.11,07,970 లక్షలు నగదు రికవరీకి ఆదేశిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచన రాణి తీర్పునిచ్చారు. ఇందులో భాగంగా సివిల్‌లో ఆర్ఎస్ ఎం–1, ఓఎస్‌టీ–3, ఈపీ కేసులు 1 మొత్తం నాలుగు కేసులు పరిష్కరించగా రూ.8.89 లక్షలు నిధులు రికవరీకి ఆదేశించారు. అలాగే క్రిమినల్ కేసుల్లో ఐపీసీ 44, అడ్మిషన్స్ 49, ఎక్సైజ్ –1, ఎంసీ–1, డీవీసీ–1 మొత్తం 97 కేసులు రాజీ కుదర్చగా సీసీ ఎక్సైజ్‌లో రూ.300 రికవరీ ఆదేశించారు. పీఎస్‌సీ బ్యాంకు కేసులు రూ.12 రాజీ చేసి రూ.2,07,921 నగదు రికవరీ చేశారు. పీఎల్‌సీ బీఎస్ఎన్‌ల్లో 13 కేసులు రాజీ చేసి, రూ. 10,749 నగదు రికవరీకి ఆదేశించారు.

**సూళ్లూరుపేటలో 1,047 కేసులు పరిష్కారం**



సూళ్లూరుపేట: పత్రాలను అందుకుంటున్న కక్షిదారు

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జరిగిన లోక్ అదాలత్‌లో 1,047 కేసులను పరిష్కరించామని అదనపు న్యాయమూర్తి ఎస్.అనూష తెలిపారు. ఎస్‌టీసీకి సంబంధించి 956 కేసులు, క్రిమినల్ కేసులు 35, చెక్‌బౌన్స్ కేసు 1, ఎంసీ 1, డీవీసీ 4, బ్యాంక్ కేసులు 48 పరిష్కరించామని తెలిపారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులు ఆవేశాలకు లోనై చేసుకున్న వివాదాల నేపథ్యంలో కేసులు అయినపుడు రాజీమార్గమే రాజమార్గమని అన్నారు.

# పథకాలు దేశానికే ఆదర్శనీయం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి మున్సిపాలిటీలోని 24వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లికి గడప గడపలో అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం నేదురుమల్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వారాజ్యం దిశగా సచివాలయాలు వ్యవస్థను తీసుకొచ్చి పల్లె ముంగిటికే పాలన అందించిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ సీ ఉమామహేశ్వరి, ఎస్ బాలయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ పీ ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎం జానకిరామయ్య, శంకరయ్య, కళ్యాణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టు సమంజసం



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: స్కిల్ డెవలెప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన నిందితుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు సమంజసమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, నగరి నియోజకవర్గ పరిశీలకుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పుల్లూరులోని ఆయన నివాసంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. అధికారాన్ని అడ్డం పెట్టు కుని ప్రజల సొమ్ము లూటీ చేయడం వల్లే చట్ట ప్రకారం చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. అధికారులతో సంబంధం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా జీఓను విడుదల చేసినట్లు అప్పటి చీఫ్ సెక్రటరీ చంద్రబాబు ఆదేశాల మేరకే ఆమోదించినట్లు చెప్పారని తెలిపారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు తనే టీడీపీ వ్యవస్థాపకుడని చెప్పుకోవడం దారుణమన్నారు. అవినీతి చక్రవర్తి చంద్రబాబును అరెస్టు చేయడంపై ఎక్కువ మంది ప్రజలు సమర్థిస్తున్నారన్నారు. ఆయన వెంట నాయకులు సుబ్రమణ్యంనాయుడు, నీలకంఠంరెడ్డి, కుమార్, వీరాస్వామిరెడ్డి, సుబ్బయ్య, కృష్ణయ్య, మునస్వామి ఉన్నారు.

## ఆక్రమణలను అడ్డుకున్న గుత్తావారిపాళెం వాసులు



యంత్రాలను అడ్డుకున్న గ్రామస్తులు

చిల్లకూరు: కడివేడు రెవెన్యూ పరిధిలోని కోట రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొంత మంది శనివారం యంత్రాలతో అక్కడికి చేరుకోవడంతో గుత్తావారిపాళెం గ్రామస్తులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 743 నుంచి 800 వరకు ఉన్న భూముల్లో కొన్ని సీలింగ్ భూములు ఉన్నాయి. వీటిలో కొంత మేర గుత్తావారిపాళేనికి చెందిన పేదలు ఎకరం చొప్పున కొనేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. అయితే సీలింగ్‌లో తమ పూర్వీకులు వదలిన భూముల్లో తమకు ఇంకా భూమి ఉందని, వారి వారసులు కొంత మంది ఖాళీగా ఉన్న భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్థానికులు ఆక్రమణలను అడ్డుకుని, ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆర్ఐ రమ్యస్వాతిని అక్కడకు పంపి, పనులు ఆపి వేయాలని సూచించారు. అనంతరం ఇరువర్గాల వారికి తమ వద్ద ఉన్న ఆధారాలను తీసుకుని తహసీల్దార్‌ను కలవాలని చెప్పారు.

## అండర్ బ్రిడ్జిలో నీరు.. రాకపోకలకు అవస్థలు



రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన వర్షం నీరు

దొరవారిసత్రం: మినమనముడి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నీరు చేరింది. దీంతో వాహనరాకపోలతోపాటు బాట సారులు కూడా బ్రిడ్జి దాటలంటే ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ ఈ మార్గంలో వెళ్లే మినమనముడి, చందరనముడి గ్రామాల ప్రజలు ఇబ్బందులు వర్ణనాతీతం. వర్షం నీటిని ఎప్పటికప్పుడు రైల్వే అధికారులు మోటార్లు పెట్టి తోడాల్సి ఉంది. కానీ ఆ దిశగా సంబంధిత అధికారులు గానీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తెలిపారు. బ్రిడ్జిలో వర్షం నీరు నిలిచిపోయిన విషయం రైల్వే అధికారులు పలుసార్లు చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉద్యోగులకు ప్రభుత్వ బాసట



ఎమ్మెల్యే సంజీవయ్య, ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

నాయుడుపేట: ప్రతి విషయంలోనూ ఉద్యోగులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని ఆకుతోట వీధిలో ఏర్పాటు చేసిన ఏపీ వైఎస్సార్ టీఎఫ్ నూతన కార్యాయాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఉపాధ్యాయ సంఘం నేతలు ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను ఉపాధ్యాయ సంఘం నాయకులు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ సంఘం కార్యాలయం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ కే దీపిక, ఎంపీపీ కే ధనలక్ష్మి, వైఎస్సార్ టీఎఫ్ సంఘం నాయకులు ఏ సురేష్, సీ అల్లేయ్య, బెనర్జీ, మధుసూదన్‌రావు, కృష్ణ, రజనీబాబు, లక్ష్మీనారాయణ, మీరయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు. (ఇన్‌సెట్‌లో) కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ జరిపారు. అనంతరం 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి పసిడి ఆభరణాలు, సుగంధభరిత పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం అర్చకులు స్వామి వారికి ఊంజల్‌సేవ చేశారు.